# ఆత్మ పరిశీలన

విమర్శకుడుగా నా కిన్నాళ్ళూ మంచిపేరు వుందనే నేను అనుకుంటూ వచ్చాను. పెద్ద పెద్ద రచయితలందరూ నాకు, విమర్శనార్థం వారి వారి పుస్తకాలు పంపుతూ వుంటారు. ఒంటరిగా కనిపించినప్పుడు చాలా వినయంగా మాట్లాడిస్తూ వుంటారు కొంతమంది యువకులు నన్ను మేధావంతునిగా పరిగణించటం కూడా కద్దు.

ఇవన్నీ నాకు ఒక విధంగా తృప్తినీ, ఆనందాన్నీ ఇస్తూవుండేవి. ఇవన్నీ నా మీద నాకున్న గౌరవాన్ని వృద్ధి చేసినై. వీటి అన్నిటికంటే మనస్సుకి హాయినికొల్పే విషయం మరొకటి వుంది. పెద్ద పెద్ద వారిని విమర్శించి, వారిలోని దొసగులను చూపగలగటంవల్ల వారందరికంటే నేను గొప్ప వాణ్ని అనే భావం క్రమక్రమేణా నన్నావహించి, నా మీద నాకు సద్భావం కలగటానికి చాలా సహాయం చేసింది. అయితే ఒకమాట మాత్రం మీరు నమ్మాలి. పెద్ద పెద్ద రచయితలకంటే గొప్పవాణ్ని అనిపించుకోటానికి మాత్రం నేను విమర్శకు దిగలేదు. ఎవరో కొంతమంది, ఓర్వలేనివాళ్ళు విమర్శకు పూనుకుంటారని అంటారుగాని, నేనది నమ్మను. అలా అనేవారు వొట్టి తుంటరులని నా ఉద్దేశం. సాహిత్యంలోని మంచి చెడులను చదువరులకు ఎత్తిచూపి, వారిని ఎడ్యుకేట్ చెయ్యటానికీ, సత్సాహిత్య సృష్టికి దోహదం చెయ్యటానికీ నేను నా కలానికి పనుపెట్టాను. సరే చాటున నన్నుగురించి గిట్టనివాళ్ళు ఎప్పుడూ వుంటూవుంటారనే నా సమాధానం.

నా స్నేహితుడు దుర్గాచలం నన్ను కలుసుకునే వరకూ నేను ఇటువంటి ఆలోచనలతో వుండేవాణ్ని. ఒట్టి ఆలోచనలే కాదు. ఏ క్రొత్త పుస్తకం ప్రచురింపబడినా దానిని గురించి నా అభిప్రాయం ప్రకటించక

పోతే అదేదో తీరని లోటుగా వుంటూవుండేది నా మనస్సుకు. ఆంధ్ర దేశంలోని అసంఖ్యాక ప్రజలకు ఏదో అపచారం చేసినట్లు అనిపించేది. వారికి ఆశాభంగం కలిగించటం ఇష్టంలేక ప్రతి క్రొత్త పుస్తకాన్ని గురించీ విమర్శ వ్రాసి ప్రచురణార్థం పత్రికలకు పంపుతూవుండేవాణ్ని. నా విమర్శలో వ్యక్తిగత దూషణ ఎక్కువపాలు ఉంటుందని నా చాటున కొందరు అనుకుంటూ వుంటారని నేను అప్పుడప్పుడూ వింటూ వచ్చాను గాని, ఆ విషయంకూడా నేను నమ్మను. ఎందుకంటే వారు అందరూ నా ఎదుట అతివినయంగా ప్రవర్తిస్తారు. నా విమర్శనా పటిమను వేనోళ్ళ ప్రశంసిస్తారు. వారు ముఖ ప్రీతి మాటలు చెప్పేవాళ్ళు కాదు కూడాను. నా నోటికీ, చేతికి భయపడి వారలా ప్రవర్తిస్తారు, ప్రశంసిస్తారు అని మీ రెవరైనా అనుకుంటే నేను చెయ్యగలిగింది ఏమీ లేదు మిమ్మల్ని చూచి జాలిపడటం కంటే.

ఇటువంటి ఊహాసౌధాలలో నేను వసియిస్తూ వుండగా నా స్నేహితుడు దుర్గాచలం తటస్థపడ్డాడు. అతనూ నేనూ చిన్ననాటి స్నేహితులం. బి. ఏ. వరకూ కలిసి చదువుకున్నాం. అతనికి ఎప్పుడు పాస్ మార్కులు మాత్రమే వస్తూవుండేవి. ఎంతకష్టపడి చదివినా అంతే. నేను ఎంత చదువకపోయినా ఏ సబ్జక్టులోనూ నూటికి ఏభై మార్కులకు తక్కువ వచ్చేవి కావు. అందుకని నేనంటే అతనికి చాలా గౌరవంగావుండేది. నేను చాలా గొప్పవాణ్ని అవుతానని అతను ఆశిస్తూవుండేవాడు. బి. ఏ. ప్యాసయి అతను ఏదో చిన్న ఉద్యోగంలో చేరాడు. ఉదరపోషణార్థం ఉద్యోగం చెయ్యటం ఇష్టంలేక, నేను ఇంటిదగ్గరే వుంటూవచ్చాను. అప్పటికీ, ఇప్పటికి సాహిత్యం చెయ్యటంకంటె, నే నింకేపనీ ముట్టుకోలేదు, నా నిస్వార్థబుద్ధికి ఇదొక నిదర్శనం.

దుర్గాచలాన్ని చూసేటప్పటికి నా ప్రాణంలేచి వచ్చింది. దుర్గాచలం చాలా మారిపోయాడు. చదువుకునే రోజులలోలాగ కాక చాలా సంతోషంగా ఉన్నట్లు కనుపించాడు. ఎప్పుడూ నవ్వుతూనే వున్నాయి అతని పెదిమలు. ముఖం వింత వర్చస్సుతో వెలుగొందుతూవుంది. నన్ను

అమాంతంగా కావలించుకొని, నా ముఖం పరిశీలనగా చూచి, "ఇదేమి టోయ్, ఇలా అయిపోయావ్?" అని తన ఆశ్చర్యాన్ని వెలిబుచ్చాడు.

"ఏం, బాగానే వున్నానే"

నా మాటలు అతను వినిపించుకున్నట్లు లేదు. "ఇలా వుంటావేమోనని నేను భయపడుతూనే వున్నాను సుమా! నేను భయపడినట్లే జరిగింది" అన్నాడు విచారంగా.

"ఎలా వున్నానేమిటి!"

"నల్లబడిపోయావ్, బుగ్గలు తోసుకుపోయినై. కండ్లు గుంటలువడి, కనుగుడ్లమీద ఎర్రని జీరలు స్పష్టంగా కనుపిస్తున్నాయి. జుట్టుకూడా వూడిపోతూ వుందే" అన్నాడు.

అతని వర్ణనకు నా మనస్సు చివుక్కుమన్నది. నేను చాలా మారిపోయినమాట నిజమే! కాని ఇంత భయంకరంగా ఉన్నానా? త్రాగుబోతును వర్ణించినట్లు వర్ణించాడు. నా మిత్రుడు వర్ణిస్తె వర్ణించాడు. కాని నేను యిలా ఉంటానని ముందుగా ఎందుకు వూహించాడో!

ఆ మాటే అడిగాను. నా కంఠధ్వని కర్కశంగా వినిపించింది.

"నువ్వు వ్రాస్తున్న విమర్శలను నేను చదువుతున్నాను. చదివి అలా అనుకున్నాను."

"అది ఏమిటి?" అని అడిగాను, నా విమర్శలు చదువుతున్నందుకు కొంత సంతోషిస్తూ.

"నువ్వు చిన్ననాటి స్నేహితుడవూ, నేను నీ శ్రేయస్సు కోరేవాడినీ అవటంవల్ల చెపుతున్నాను. నువ్వు వ్రాస్తున్న విమర్శలు ఆరోగ్యకరంగా లేవు. ఏదో తీరని కక్ష మనస్సులో పెట్టుకొని వ్రాస్తున్నావనిపించింది. రాగద్వేషాలతో వికలం అయిన మనస్సుయొక్క ఆర్తనాదాలకు వలె వినిపించినవి అవి నాకు. అటువంటి రచనలు చెయ్యటానికి నువ్వు చాలా మారిపోయి వుండాలనిపించింది. నేను ఎరిగిన నీ రూపాన్ని ఊహించుకోటానికి ప్రయత్నించాను. ఆ రూపానికి బదులు ఇప్పుడున్న నీ రూపం నా కళ్ళెదుట ప్రత్యక్షం అయింది" అన్నాడు.

అతనిని నేను ఏమీ అనలేకపోయాను. ఇటువంటి మాటలు నా దగ్గర అనటానికి ఇంకెవ్వరికీ సాహసం లేదు. ఎవరన్నా అని ఉంటే నా నోటివెంట ఎటువంటి మాటలు వెలువడివుండేవో నాకు తెలుసు, కాని చిన్న నాటి స్నేహితుణ్ని ఏమనేటట్టు?

“సాహిత్యరంగాభివృద్ధికి విమర్శ అవసరమేగదా?” అన్నాను.

“అవసరమే! కాని ఆ విమర్శలో, రచనలపట్ల ఎంత సానుభూతీ రచయితలపట్ల ఎంత సద్భావం ఉండాలి! నీ విమర్శలో నా కటువంటి లక్షణాలేమీ కనబడటంలేదు. అవకాశంకోసం పొంచుకొనివుండి, విరుచుకు పడే శత్రువుకు మల్లే నీవు రచయితలమీద విరుచుకపడతావు. ఎలుకతో పిల్లి చెలగాటం ఆడినట్లు ఆడి సంతోషిస్తావు. నీ ప్రతిభను చూపటం రచయితను నవ్వులపాలు చెయ్యటంకంటే నీకు వేరే ఆదర్శం ఉన్నట్లు కనబడదు. అన్వేషించే దుర్బుద్ధి కలగాలేగాని సంఘంలో రంధ్రాలు ఎప్పుడూ కనిపిస్తూనేవుంటై. అయితే ఆ పని రంధ్రాన్వేషణచేసే వ్యక్తికే నష్టం అని తెలుసుకొని ఆ వృత్తికి దిగరాదు” అన్నాడు దుర్గాచలం.

అతని మాటలు నా చెవులకు వింతగా వినుపించినై.

“నాకేం నష్టం?” అన్నాను నేను.

“నీకు కాకపోతే ఎవరికి నష్టం?” అని మొదలు పెట్టాడు దుర్గాచలం.

“ఎప్పుడూ చెడు చూడటమే అలవాటుగా పెట్టుకున్న వ్యక్తి కొన్నాళ్ళకు తానే చెడ్డై కూర్చుంటాడు. అసలు విమర్శ ప్రక్రియలో సృజనశక్తిని చంపేగుణం, చంపుకునే గుణం వుంది. సృజనశక్తి చచ్చిన మనిషి మనిషి కాదు. రాక్షసుడు. దైవత్వం తెచ్చుకోవలసిన మనిషి తెలిసి రాక్షసుడవటంకంటే ఇంక ఘోరం ఏముంటుంది? ఇంకా నాకేం నష్టం అంటున్నావా? కాలేజీలో జీవేచ్ఛతో తొణికిసలాడుతూ వున్న నీకూ, మనస్సును ముడుచుకొని విమర్శ నెపంతో జీవితంలో నీవు పొందిన ఆశా

భంగాన్నీ, దానివల్ల జనించిన అసూయా ద్వేషాలనూ కప్పుకొని, కాలం గడుపుతున్న ఈ నాటి నీకూ ఎంత భేదం ఉన్నదో ఆలోచించుకుంటే నీకే తెలుస్తుంది" అన్నాడు.

ఆ మాటలకు నా శరీరం జలదరించింది. ఇక తరచి అడగలేక పోయాను. అతను నాతో కలిసి రెండురోజులు వున్నాడు. ఆ రెండు రోజులు అతనుకూడా ఈ ప్రస్తావన తేలేదు. వెళ్ళేటప్పుడు మాత్రం "నీ మనస్సుకి కష్టం కలిగిస్తే క్షమించవోయ్. చాలామందికి నువ్వంటే భయం. అందుకని నీ ఎదుట వారు మనస్సువిప్పి మాటాడరు. పైగా నువ్వు అపార్థం చేసుకున్నా సరే; అనే ఉద్దేశ్యంతో నిజం చెప్పవలసిన అవసరం వాళ్ళ కేముంది? ఆ అవసరం నాకు ఉన్నది; చెప్పాను తరువాత నీ ఇష్టం" అన్నాడు.

నా స్నేహితుడు అన్నమాటలకు నిజంగా నేను చాలా కలవర పడ్డాను. అతడు వెళ్ళిన తరువాత చాలా ఆలోచించాను. నా జీవితమంతా ఒక్కసారి కండ్లముందు ప్రదర్శితమైంది. ఈ పది సంవత్సరాల్లో నాలో వచ్చిన మార్పు కండ్లకు కట్టినట్లు కనుపించింది.

నేను చిన్నప్పటినుంచీ అమిత ఉత్సాహపరుణ్ణి, ఆవేశపరుణ్ణినూ. నా మనస్సు చాలా సున్నితమైనదని మా అమ్మ అంటూ వుండేది. ఆమె తన మాటల్లో "ఇంత బీదమనస్సు వాడివి ఎట్లా బ్రతుకుతావురా?" అంటూ వుండేది. ఊళ్ళో ఎవరికి ఎంత చిన్న కష్టం వచ్చినా నేను ఊరుకోలేక పోయే వాణ్ణట. మా వూరుచుట్టూ తోటలు వుండేవి. ఆ తోటల్లోకి వెళ్ళి అక్కడి పువ్వులను చూస్తూ ఎన్ని గంటలైనా నన్ను మరచి కూర్చుండి పోయేవాణ్ణట! అక్కడనుంచి మా అమ్మ పట్టుబలవంతాన తీసుకురావలసి వచ్చేదట. ఏ ఆటలో చూచినా నేనే! ఎక్కడచూచినా నేనే! ఒక్కక్షణం ఇంటిపట్టున వుండేవాణ్ని కానట. ఇంట్లో వున్న కాసేపూ ఏదో చిలిపిపని చేస్తూనే ఉండేవాణ్ణట!

ఈ ఉత్సాహం, ఆవేశం, నేను బి. ఏ. ప్యాసయ్యే వరకూ

ఉంటూనే ఉండేవి. మామూలుగా ఆటలు మరగిన విద్యార్థులకు చదువు వచ్చేదికాదు. చదువు మరిగిన విద్యార్థులకు ఆటలు వొచ్చేవి కావు. నేను అల్లా కాదు. అటు ఆటలూ, ఇటు చదువూ అన్నిటిలోనూ బాగానే ఉండే వాణ్ని. ఎందులో ప్రవేశించినా అమితోత్సాహం చూపేవాణ్ని. అందువల్ల ప్రేక్షా నాకు ఆనందంగానే ఉండేది విద్యార్థులందరూ నన్ను ప్రేమ పూర్వకంగా, గౌరవప్రదంగా చూసేవారు. లెక్చరర్స్‌కి కూడా నేనంటే ఇష్టంగానే ఉండేది. నేను కాలేజీ నాటకాల్లో వేషాలు వేసేవాణ్ని. నా వేషం చూడటానికి ఊళ్ళో ఉన్న ప్రముఖులు కూడా వస్తూవుండేవారు. నేను కాలేజీ మేగజీన్లోనే కాక ఇతరపత్రికల్లో వ్యాసాలూ, పద్యాలూ వ్రాస్తూ వుండేవాణ్ని. వాటిని తోటి విద్యార్థులందరూ మెచ్చుకుంటూ వుండే వారు ఆ రోజుల్లో నేను పట్టిందల్లా బంగారం అవుతుందనీ. నేను బహూ ముఖ ప్రజ్ఞాశాలిననీ ప్రతీతి.

నేను బి. ఏ ప్యాసయిం తరువాత ఈ పరిస్థితులన్నీ మారిపో యినై. అప్పటికే మా నాయనగారు మరణించారు. ఇంటి వ్యవహారాలు నా నెత్తినపడినై. పైగా ఉద్యోగం చెయ్యాలనే ఆపేక్ష ఆనాడు నాకు ఉండేది కాదు.

మా గ్రామంలోనే ఉండి చేతనైనంతవరకు పదిమందికి సహాయం చేస్తూ సంఘానికి ఉపకరించే సద్గ్రంథాలు వ్రాస్తు కాలక్షేపం చెయ్యాలని సంకల్పించుకున్నాను కొన్ని సంవత్సరాలుగా బాగానే జరిగినై. ఊళ్ళో వాళ్ళంతా నన్ను అమితంగా గౌరవించేవారు. నా సత్ప్రవర్తన వారిని బాగా ఆకర్షించింది. ఏ తగదా వొచ్చినా నా దగ్గరకే పరిష్కారానికి వొచ్చే వారు. నేను చెప్పినట్లు నడుచుకునేవారు. నేను సంకల్పించిన గ్రంథాలు వ్రాయలేకపోయినా, యెప్పుడూ పత్రికలకు వ్రాస్తూండేవాడ్ని.

కాని పది సంవత్సరాలు గడిచేప్పటికి పరిస్థితులన్నీ తారుమారైనై. అంతా నా కండ్లముందు నాటకం జరిగినట్లు జరిగిపోయింది. ఒక్కొక్కరి చొప్పున నా దగ్గరకు మొత్తం అందరూ రావటం మానివేశారు. కారణం

వేరే ఏమీలేదు. మొదట్లో వారికి తీరకా – తరువాత నా సలహాలు వారికి అవుసరం లేకా! రోజులు గడిచినకొద్ది వారు నన్ను ఛాదస్తుని కింద జమ కట్టారు. 'అసమర్థులందరూ సత్ప్రవర్తకులే' అని తేల్చుకున్నారు.

అప్పుడు నేను నిశ్చితంగా ఆలోచించాను. కన్ను తెరిచాను. ఊరంతా ఎంత మారిపోయిందీ గ్రహించాను. నేను కబుర్లతో కాలక్షేపం చేస్తూ ఎంత వెనుకబడిపోయిందీ తెలుసుకున్నాను. శరీరం ఉడికిపోయింది.

అనాడు ఒక్క ఈ విషయం, ఆ విషయం అనికాదు. మొత్తం మానవునిదృష్టే మారిపోయింది. సాంఘిక విలువలే మారిపోయినై. ఇది వరకు సత్ప్రవర్తనకు విలువ ఉండేది. ధనార్జనా, సంకల్పం ఒక వ్యసనంగా పరిగణింపబడేది. ఇప్పుడో? చెప్పనే చెప్పానుగదా! సత్ప్రవర్తన చాదస్తానికి చిహ్నం కాసులను కూడబెట్టటమే జీవితానికి ముఖ్యం. అది వరకు ధనవంతులు సైతం సత్ప్రవర్తకులను గౌరవించేవారు. వారిని పోషించే బాధ్యత తమ మీద వేసుకునేవారు. అందువల్ల సత్ప్రవర్తకులుగా ఉండే అవకాశం వుండాలనే అపేక్ష వారికి వుండేది. ఇప్పుడు డబ్బూ, గౌరవం విడివిడిగా వుండటం మానివేసినై డబ్బు ఎక్కడుంటే గౌరవం కూడా అక్కడే వుంటూ వుంది. ఇక వూళ్లో వాళ్ళు నా దగ్గరకు వచ్చి సలహాలు తీసుకోవలసిన అవుసరం యేముంది? నేను డబ్బున్నవాణ్ని కాదు. డబ్బు సంపాదించే అవకాశాలు తెలిసినవాణ్నీ కాదు. ఇక వారు నన్ను తృణీకరించటంలో ఆశ్చర్యమేముంది?

వెంటనే నా దృష్టి భౌతిక భోగాలమీదకు తిరిగింది. నేను చదువుకున్న వాణ్ని, కొద్దోగొప్పో జ్ఞానార్జన చేసినవాణ్ణి. కాని ఏం లాభం? నా కుటుంబాన్ని పోషించటమే కష్టంగా వుంది. ఇక మిగిలినవాళ్ళ సంగతి అంటారా?

చిన్నతనంలో ఇంటినుంచి పారిపోయి నాటకాల్లోజేరిన ఒకతను, సినిమాల్లో జేరి లక్షలు గడిస్తున్నాడు. చిన్నప్పుడు చదువు సంధ్యలు మాని పోకిరిగా తిరిగిన ఒకతను, వ్యాపారం పెట్టుకొని హాయిగా కాలక్షేపం చేస్తు

న్నాడు. చిన్నప్పుడే, వూళ్ళో కక్షలకు కారకుడై గ్రామస్థుల హృదయాలలో అగ్నిజ్వాలలు రేపిన ఒకతను రాజకీయాలలో ప్రవేశించి, వుపన్యాసాలు చెప్పటం నేర్చుకొని, యిప్పుడు వున్నతపదవులను అధిష్ఠించి దేశనాయకుడుగా పరిగణింపబడుతున్నాడు.

ఇప్పుడు వీరందరి జీవితాలూ భోగాలకు ఆటపట్టులై ధగధగ మెరిసిపోతున్నాయి. గౌరవమూ వారికే? యెక్కడికి వెళ్ళినా మీటింగులు, టీపార్టీలు, పూలహారాలు! నా ముఖం చూసేవారేలేరు. ఎందుకని? ఇక ఈ సత్ప్రవర్తనకు అర్థం ఏమిటి? భార్యతో 'బియ్యం లేవు' అనిపించుకోటానికా, చిరుదిండికి పిల్లలు డబ్బు అడిగితే లేదని చీదరించుకోటానికా?

ఆలోచించినకొద్దీ భౌతికేచ్ఛలకు మించిన నిత్యసత్యమైన ఆదర్శం వొకటివుందనే విషయం మీదకూడా నాకు నమ్మకం సన్నగిల్లింది. నేనూ సంపాదనకు నడుం కట్టాను. కాని యెక్కడ మొదలుపెట్టాలో తెలియలేదు. భుజం మోపుదామన్నా యెక్కడా నలుసంత చోటుకూడా దొరకలేదు.

మా యింటి ప్రక్కనే వొక లారీల యజమాని వుండేవాడు. నేను ఎరిగిన తరువాతకూడా అతను బీదవాడు. కారు డ్రయివర్‌గా వుండి భుక్తి గడుపుకుంటూవుండేవాడు. మా నాన్నగారిదగ్గరకువచ్చి అప్పుడొక అయిదూ, అప్పుడొక పదీతీసుకువెళుతుండేవాడు. అటువంటివాడు నెమ్మదిగా చిన్న కారుకొని తరువాత రెండు లారీలూ, రెండు బస్సులూకొని ఇప్పుడు బాగా డబ్బు గడించాడు. అప్పుడతనికి సొంతానికిచిన్నకారు ఉండేది. అతనితో సంప్రతించాను. అతను తన కార్లలో భాగంజేరమన్నాడు. అదైనా నేను గనుక ఇస్తానన్నాడు. నేను ఆనందభరితుడ నయ్యాను.

అతను మొదట మంచివాడే. కాని వ్యాపారంలో జేరి దానికి సంబంధించిన లక్షణాలను అలవరచుకున్నాడు. ఆ సంగతి నాకు తెలియదు. నేను భాగస్వామిగా జేరినప్పటినుంచి వింతగా ప్రవర్తించటం మొదలుపెట్టాడు. చివరికి నష్టం చూపెట్టాడు. ఏం చెయ్యను? చావుతప్పి కన్నులొట్టపోయి, బయటపడ్డాను. ఇంకేదన్నా వ్యాపారం చేద్దామంటే, నా భార్యపోరు ఎక్కు-

పైంది. "ఉన్న ఆస్తన్నా మిగల్చండి, కలో గంజో తాగి బ్రతుకుదాం" అని ఆమె చెవిని ఇల్లు కట్టుకొని పోరింది? పదిమందితో చెప్పించింది. "వ్యాపారం మీబోటి పెద్దలకు లాయకీ అయిన పనికాదండీ" అన్నారు గ్రామస్థులు.

నేను మెదలకుండా కూర్చోటానికి అలవాటుపడ్డాను. బ్రతుకు భారం అనిపించింది, ఆ భారం తగ్గించుకోటానికి విరివిగా వ్రాయటం మొదలు పెట్టాను అంతకుముందు నా రచనలను యెవ్వరూ పట్టించుకునేవారుకాదు. ఇప్పుడు నా రచనలు చాలామందిని ఆకర్షించినై. నేను ప్రఖ్యాతిలోకి వచ్చాను. నాకు తెలియకుండానే విమర్శకుడ నయ్యాను. 'విమర్శకాగ్రేసరుడు' అని కొందరిచేత మెప్పులుకూడా పొందుతున్నాను.

కాని, నా స్నేహితుని మాటలు విన్న తరువాత ఆత్మపరిశీలన చేసి చూసుకుంటే నా విమర్శలకు పునాది జీవితంలో నేను పొందిన ఆశాభంగం, నిస్పృహే కారణమేమో అని అనిపిస్తూవుంది. నాకు తెలియకుండానే సంఘంమీదా, సంఘంలో సుఖంగావున్న వ్యక్తులమీదా నాకు కక్ష ఏర్పడి వుంటుంది. నా స్నేహితుడు అన్నట్లు ఆ కక్షను విమర్శనెపంతో తీర్చుకుంటూ వుండివుంటాను. రంధ్రాన్వేషణే నాపని అయింది. ఇక రాక్షసుడ నయ్యానంటే ఆశ్చర్యం యేముంది! నా ఆకారం మారిందంటే మారకేమవుతుంది? నా ముఖం అద్దంలో చూచుకుందా మనుకున్నాను. భయం వేసింది. యిటువంటి మనోవేదన సమయాల్లో ఎవ్వరికైనా భార్యలు జ్ఞప్తికి వస్తారు. నాకూ అంతే.

"నేను వొకసంగతి అడుగుతాను, నిజం చెప్తావా?" అని నా భార్యను అడిగాను.

"ఎందుకు చెప్పను?"

"నేను ఈ పది సంవత్సరాలలో చాలా మారానా?" అని అడిగాను.

"నేనేం చెప్పగలను?"

"నా శ్రేయస్సును కాంక్షించి చెప్పు."

"మారటం ఏమిటంటే? అప్పటికీ ఇప్పటికి పోలికే లేదు" అన్నదినా భార్య! అని వొక నిట్టూర్పు విడిచింది. ఆ నిట్టూర్పు శూలంలాగ దిగబడింది నా హృదయంలోకి. "మన పెళ్ళయిన క్రొత్తరోజుల్లో ఎంత ఉత్సాహంగా, ఎంత ఉదారంగా, ఎంత శాంతంగా వుండేవారు. మీతో మాట్లాడటమే ఆనందంగా వుండేది. ఇప్పు డా గుణా లన్నీ యేమైనవో! అన్నిటికీ తప్పులు పట్టటమే! అన్నిటికీ చిర్రు బుర్రు మనటమే. పలకరించటానికే భయంగా వుంటూవుంది. ఇక పిల్లలసంగతి చెప్పనే అక్కర్లేదు. ఏదో కారణంతో వాళ్ళని కొట్టనిరోజు యేదన్నా వుందా చెప్పండి."

వెంటనే నా స్నేహితుడు అని వెళ్ళిన 'రాక్షసుడు' అనేమాట జ్ఞాపకంవచ్చి, కండ్లలో నీళ్ళు తిరిగినై. నేను నిజంగానే రాక్షసుడ నయ్యాను. సందేహంలేదు.

ఆ రాత్రి నాకు నిద్రపట్టలేదు. ఆలోచిస్తూ పడుకున్నాను. ఇటీవల నేను వ్రాసిన విమర్శలన్నీ ఒక్కొక్కటే జ్ఞాపకం వచ్చినై. నిజమే! జీవితంలో నాకు అందవని తేల్చుకున్న విషయాలనే తృణీకరించాను. తెలి విగా విమర్శించాను. ఏదోవొక ఉన్నత పదవుల్లోవున్న వ్యక్తులనే నిరసిం చాను. పదిమంది అవునన్నది కాదనటమే, పదిమంది మెచ్చుకున్నది దిగ దుడుపు చెయ్యటమే పనిగా పెట్టుకొని వ్రాసినట్లు నా మనస్సుకే అనిపిం చింది. నా మిత్రుడు అన్నమాటల్లో తప్పులేదు. నాలో ఎంతకక్ష పేరుకుని వుందో! నన్ను నడుపుతున్న శక్తే 'కక్ష' అయిందని అప్పుడు గ్రహించి నా పతనానికి కన్నీరు పెట్టుకున్నాను.

నాకు మారాలనివుంది. మారగలనా? ఎందుకు మారలేను! నా శక్తి తోనేగదా నేను నా జీవితాన్ని పాడుజేసుకుంది! ఆ శక్తితోనే నా జీవితాన్ని యెందుకు పునర్నిర్మించుకోలేను? ఈసారి మీరు నన్ను చూచేప్పటికి వొక నూతన వ్యక్తిని చూడగలుగుతారు. సందేహంలేదు. ఈ సంగతి తలచు కుంటేనే యెంత ఆనందంగా వుంది!

అయితే యే విధంగా మారాలి? నాకు వెంటనే యిదమిద్ధమని తేల లేదు.

నేనా మధ్య కొన్ని మంచిమంచి గ్రంథాలు పోగుజేశాను. అందులో టాగూర్ రచనలుకూడా వున్నవి. టాగూరు నేను కాలేజీలో చదువుకున్న రోజుల్లో చదివాను. మళ్ళీ చదువలేదు. మొదట్లో నాకు టాగూరు అంటే యిష్టంగానే వుండేది. కాని నేను విమర్శకుడనైన పిదప ఆయనంటే ఇష్టం తప్పింది. టాగూరు వొట్టి సెంటిమెంటలిస్టు అని నా అభిప్రాయం. ఆనాడు నాకు సెంటిమెంటుమీద యే మాత్రం గౌరవం వుండేదికాదు. అది నరాల బలహీనతవల్ల పుట్టిన జబ్బని నా విశ్వాసం.

అటువంటి టాగూర్ రచనల మీదకుపోయింది....మనస్సు. చేతికి అందిన పుస్తకం తీసి పేజీలు తిరగవేశాను. ఆ పుస్తకంపేరు క్రియేటివ్ యూనిటీ' కంటికి అందినచోట చదివాను. ఎక్కడ చదివినా, యే వాక్యం చదివినా మనస్సు పులకరించింది. త్రుళ్ళింతలికింది. ఆయన ఉద్దేశం అస్పష్టంగా మాత్రమే అర్థమయ్యేది. కాని మనస్సు మాత్రం ఉప్పొంగి పోయేది. ఈ అనుభూతి నాకు క్రొత్త. ఇదివరకు కొన్ని పుస్తకాలు చదువు తుంటే శరీరం కదిలేది; మరికొన్నిటికి మెదడు కదిలేది; వీటివెనుక ఉన్న నిత్యసత్యమయిన వస్తువేదో కదిలి, అన్ని అంతస్తులకూ వ్యాపించి పరవ శుణ్ణి చేసింది, టాగూర్ చదువుతుంటే, ఎంత గొప్పగా వ్రాశాడు! అని

అసబుద్ధికాదు. కండ్లు మూసుకొని, శరీరాన్ని సడలించి అతన్ని అంత ర్గతంగా కలిగించిన మధురానుభూతిని ఆనందిస్తూ తన్మయత్వం పొంద బుద్ధి అవుతుంది.

అప్పుడు నాకు అనిపించింది. ఇంతకుముందు నేను అందుకోలేని దానిని దేన్నో అందుకోవచ్చునీ, దాన్ని ఇతరులకు పంచి పెట్టవచ్చునీ దానిని జీవితంలో నిర్లిప్తంగా పాల్గొనటంద్వారా, అనుక్షణం సృజనశక్తిని ప్రజ్వలించుకోవటం ద్వారా, అందుకోవచ్చునీ, విమర్శ నెపంతో దానిని చిదిమి వేసుకోవటమే నా ఘోరపతనానికి కారణం.

అప్పుడే గదిలోకి అడుగుపెట్టిన నా భార్య, "ఇంకా నిద్రపోలేదా?" అని అడిగింది.

"లేదు."

"చాలా ప్రొద్దుపోతోంది-పడుకోండి"

ఆ రాత్రి నాకు హాయిగా నిద్రపట్టింది. ఎన్ని సంవత్సరాలకు గానో!"....

—o—